క్లుప్తంగా

60 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

అచ్యుతాపురం(అనకాపల్లి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం ప్రశాంతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 60 మంది యువకులు రక్తదానం చేశారు. నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ అధికారులు రాము నాయుడు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి మణికంఠ, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మి రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో నగర సంకీర్తన



నగర సంకీర్తన నిర్వహిస్తున్న గ్రామస్తులు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు గ్రామంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు నగర సంకీర్తన మేలుకొలుపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నెల రోజుల నుంచి ఈ కార్యక్రమం జరుగుతోంది. గురువారం వేకువ జామున గ్రామానికి చెందిన చిన్నారులు సైతం ఈ నగర సంకీర్తనలో పాల్గొనడం విశేషం. తెల్లవారు జామునే భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తూ గ్రామం అంతటా తిరుగుతూ నగర సంకీర్తన చేస్తున్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఓటీఎస్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

మునగపాక : వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ కోరారు. గురువారం ఆయన ఒంపోలు సచివాలయంలో ఓటీఎస్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఓటీఎస్ ద్వారా లబ్ధిదారులకు మేలు జరుగుతుందన్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయం అందుతుందన్నారు. సర్పంచ్ గండ్రెడ్డి సూరిబాబు, పీఎంసీ చైర్మన్ వెంకటప్పారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు వినతి



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండలంలో నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌లో జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టు సదుపాయం కల్పించాలని పలువురు ప్రయాణికులు గురువారం సంతకాలు సేకరణ చేశారు. స్థానిక గ్రామాల ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు స్టేషన్ మాస్టార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో వారం రోజుల పాటు సంతకాలు సేకరించి రైల్వే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్లాలని స్టేషన్‌లో ప్రయాణికులు సంతకాలు చేసేందుకు వీలుగా చార్ట్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మొదటి రోజు వందకు పైగా ప్రయాణికులు సంతకాలు పెట్టారు.

నేడూ గడప గడపకు

ఎస్.రాయవరం : మండలంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.



పూడిమడకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



కొండపాలెంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



తోటాడ జెడ్పీ హైస్కూల్లో స్వామి వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వివేకానందుని బోధనలు ఆచరణీయం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. సుమారు వేయి మంది వృద్ధులు, వితంతులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వంద మంది చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. రక్తదాతలకు షీల్డ్ బహుకరించారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మల్లేశ్వరరావు, అక్షర భారతి ఫౌండేషన్ ఛైర్మన్ మైలపల్లి రమణ, మైలపల్లి లక్ష్మణ, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చోడపల్లి రమణ, కార్యదర్శి మేరుగు అప్పలనాయుడు చేతుల మీదుగా దుస్తులు, బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరుగు కాసుబాబు, దాసరి శ్రీను, చేపల కృష్ణ, సూరాడ దేముడు, ఎరిపల్లి గంటలరావు, సూరాడ సత్తిబాబు, మేరుగు మహేశ్ బాబు, అర్జీల జగదీష్ పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక శివారు కొండపాలెం తుఫాన్ షెల్టర్‌లో గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శ్రీస్వామి వివేకానంద వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో వంద మంది వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు మేరుగు నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కంబాల అప్పలరాజు, సూరాడ ప్రభాకర్ పాల్గొన్నారు.

వివేకానందుని ఆశయ సాధనకు పాటుపడాలి



రేవు పోలవరంలో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐ నారాయణరావు

మునగపాక : ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందుని ఆశయ సాధనకు పాటుపడాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కావలి రామారావు ఆకాంక్షించారు. వివేకానందుని జయంతి సందర్భంగా తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 1992–93లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వివేకానందునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం పద్మావతి, నిర్వాహకులు ఆళ్ల నాగేశ్వరరావు, అంగులూరి రామకృష్ణ, డి.జగన్నాథరావు, పి.వీరప్పారావు, నరసింగరావు, గోవింద,సచివాలయ ఉద్యోగి వెంకటరెడ్డి, ఉత్తమ ఆర్గానిక్ రైతు ఆడారి శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగులాపల్లిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మళ్ల కాశేశ్వరరావు ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి నిర్వహించారు.

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బంగారు చిలుకు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శకుంతల, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ, రిటైర్డు హెచ్ఎం కోవెల వెంకటరావు, దల్లమ్మదేవి, బాబూజీ పాల్గొన్నారు

నక్కపల్లి: స్వామి వివేకానంద 160 జయంతి కార్యక్రమాన్ని గురువారం చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె. జనార్దన్ వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య పట్ల వివేకానందుడికి అత్యున్నతమైన అభిప్రాయాలు ఉండేవన్నారు. ఆయన భావాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను రూపొందించగలిగితే భారత విద్యార్థులు జాతిరత్నాలుగా విరాజిల్లుతారన్నారు. 1897లో ఆయన రామకృష్ణ మిషన్ స్థాపించారన్నారు. వివేకానందుడి దృష్టిలో మానవ సేవకు అంకితం కావడం అంటే భగవంతుని సేవకు అంకితమైనట్లేనన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయుడు సతీష్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశయాలు ఆచరణలోకి తేవాలి

ఎస్.రాయవరం : వివేకానందుని సూక్తులు, ఆశయాలు అనుసరించ దగ్గ విషయాలని నక్కపల్లి సీఐ నారాయణరావు సూచించారు. రేవుపోలవరం గ్రామంలో వివేకానందస్వామి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తీరంలో నెలకొల్పిన వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులంతా వివేకానంద ఆశయాలను ఆచరణలోకి తీసుకోవాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వివేకానంద జయంతి వేడుకలు పురస్కరించుకుని బంగారు చిట్టి సహకారంతో ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యుడు గణేశ్వరరావు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలకు ఏర్పాట్లు చేశారు.

సీతంపాలెంలో క్రికెట్ పోటీలు

నక్కపల్లి : సంక్రాంతి పండగను పురస్కరించుకుని సీతంపాలెం గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గొర్ల విజయ అప్పలరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు శీరం నర్సింహమూర్తి ప్రారంభించారు. ఈ పోటీలు వారం రోజుల పాటు జరుగుతాయని, విజేతలకు ముగింపు రోజు 18న బహుమతులు ప్రదానం చేస్తామని అప్పలరాజు అన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు.

కొనసాగుతున్న నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి : నేవీ నిర్వాసితుల ధర్నా కొనసాగుతుంది. గురువారం నాటికి ధర్నా 74వ రోజుకు చేరింది. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలంటూ నేవీ నిర్వాసితులు నినాదాలు చేసారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, గోవిందపాలెం, కొత్తపేట తదితర గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

కోడి పందాలు , జూదం వద్దు

రాంబిల్లి: సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దీనబంధు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంక్రాంతి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. అలాగే గుండాటలు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా వుండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు నిర్వహించరాదన్నారు.

తులసీరావు మృతి పాడి రైతులకు తీరనిలోటు



మూలపేటలో తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డెయిరీ చైర్మన్ స్వర్గీయ ఆడారి తులసీరావు సేవలందించారని డెయిరీ జోనల్ మేనేజర్ శరగడం రమణ అన్నారు. మూలపేటలో గురువారం పాడి రైతులకు సంక్రాంతి బోనస్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో కలిసి ఆయన తులసీరావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తులసీరావు మృతి పాడి రైతులకు తీరని లోటన్నారు. తులసీరావు హయాంలో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు, పాలసంఘ అధ్యక్షుడు కాండ్రేగుల నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ ఆదిఅప్పారావు, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి



రామకృష్ణకు నియామక పత్రాన్ని అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్రంలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు అన్నారు. పట్టణంలో మత్స్యకార సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మత్స్యకారుల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించడం కోసం, విద్యాపరంగా మత్స్యకారులు అభివృద్ధి పొందడం కోసం సంఘం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. మండలంలో గల కుమారపురం గ్రామ శివారు రత్నయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడైన పెరుమళ్ళ రామకృష్ణను రాష్ట్ర సంఘం యువజన విద్యార్థి విభాగానికి ప్రతినిధిగా నియామకం చేసినట్టు అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు రామకృష్ణకు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం జిల్లా నియోజకవర్గ అధ్యక్షుడు పిక్కి కొండలరావు, కొవిరి వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు నీలాపు బాలకృష్ణరెడ్డి, చిరంజీవిరెడ్డి, వెంకటరెడ్డి, రాంబాబు రెడ్డి, అప్పలరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సంపద కేంద్రానికి భూమిపూజ

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మూలపేటలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించనున్న సంపద తయారీ కేంద్రానికి ఆమె గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే ఈ కేంద్రాల ద్వారా ఎరువులు అందుబాటులోకి వస్తాయన్నారు. సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో నిబంధనలు పాటించాలి

యలమంచిలి : సంక్రాంతి సంబరాల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలకు ప్రజలు బంధువుల ఇళ్ళకు వెళ్ళినపుడు విలువైన అభరణాలు, వస్తువులను విడిచి వెళ్ళవద్దని, ఇల్లు విడిచి వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే తగిన భద్రత కల్పిస్తామని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసేటప్పుడు హెల్మెట్ విధిగా ధరించాలని, పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందాలు, పేకాట, గుండాట, వంటి వాటికి దూరంగా ఉండాలని, జూదాల్లో పాల్గొని ధనం కోల్పోవద్దని, పండగల్లో తీర్థాల్లో డ్యాన్స్‌బేబీ డ్యాన్స్‌లకు అనుమతులు లేవని అన్నారు. అక్రమంగా మద్యం తరలించరాదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించాలి

కోటవురట్ల : సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీ కృష్ణ చరణానంద భారతి మహరాజ్ అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని పాములవాకలో మేలుకొలుపు మహా సమ్మేళనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్వామి 35 గ్రామాల నుంచి వచ్చిన మేలుకొలుపు బృందాలతో కలిసి ఎస్సీ కాలనీలోని రామాలయం నుంచి మేలుకొలుపు నిర్వహించారు. శ్రీ పట్టాలమ్మ నవదుర్గల దేవస్థానం వరకు సంకీర్తన చేశారు. స్వామి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు హిందూ ధర్మ గొప్పతనాన్ని చాటిన మహోన్నతుడు స్వామి వివేకానంద అన్నారు. భారతదేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లు అన్నారు. ప్రతి హిందువు ఇంట భగవద్గీత ఉండాలన్నారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. భగవద్గీత విశ్వ మానవ జ్ఞాన గ్రంథమన్నారు. ఈ మహా గ్రంథం ప్రపంచ దేశాలకే మార్గదర్శకం అన్నారు. పల్లెల్లో ధనుర్మాసోత్సవాలలో మేలుకొలుపులు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక భావన మానసిక ప్రశాంతత, శాంతిని అందిస్తుందన్నారు. అనంతరం మేలుకొలుపు బృందాలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు గొట్టిముక్కల శ్రీహరిరాజు, ఆలయ ధర్మకర్త ఎస్.వి.రమణ, పాకలపాటి అరవిందు కుమార్, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, ఎస్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.,రంగారావు, మహిళా సమన్వయ ప్రముఖ్, లలిత, అల్లు లక్ష్మి, శోభారాణి, వేచలపు జనార్ధన్, జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.



పాములవాకలో మేలుకొలుపులో పాల్గొన్న శ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామి

వల్లభ నారాయణుడికి ప్రత్యేక పూజలు

రాంబిల్లి : దిమిలిలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను నూతన వస్త్రాలు, పూలతో అందంగా అలంకరించారు. అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ(బుజ్జి) శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేసారు.

కాలినడకన సింహాద్రప్పన్న దర్శనానికి...



సింహాచలం బయలుదేరుతున్న భక్తులు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో సింహాద్రప్పన్న మాలలు ధరించిన భక్తులు గురువారం సింహాచలం పయనమయ్యారు. మాలలు ధరించిన భక్తుల మాలధారణల గడువు ముగియడంతో ఇరుముడులు ధరించి కాలినడకన సింహాచలం బయలుదేరి వెళ్లారు. గురుస్వామి భీమరశెట్టి అప్పారావు ఆధ్వర్యంలో 41 రోజుల దీక్ష ముగించుకొని బయలుదేరిన వారిని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహానరసింగరావు, రామజోగినాయుడు, దశావతారం తదితరులు అభినందించారు.

కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ



సూర్యనారాయణ కుమార్తెను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: అనారోగ్యం బారిన పడ్డ కుటుంబాలు ధైర్యం కోల్పోవద్దని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. చినగుమ్ములూరు గ్రామానికి చెందిన సూర్యనాయణ అనే కార్యకర్త 8 నెలల కుమార్తె అనారోగ్యం బారిన పడడంతో గురువారం కేజీహెచ్‌లో పరామర్శించారు. ఓదార్చి వైద్యులతో మెరుగైన వైద్యం చేయించాలని సూచించారు. ఎటువంటి సహకారం అవసరమైనా అండగా ఉంటానని తెలిపారు.

ప్రతి ఒక్కరి సంక్షేమానికి నవరత్నాలు



దళిత కాలనీలో ఎమ్మెల్యేకు హారతి ఇస్తున్న మహిళ

ఎస్.రాయవరం : గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందాలనే ఉద్దేశంతో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేశారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజా కాలనీ, వైఎస్సార్ కాలనీ, దళిత కాలనీ, కుమ్మరి వీధి, గొల్ల వీధి, శెట్టి బలిజ పేటలలో ఉత్సాహంతో తిరిగారు. గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల లబ్ధిపై ప్రజలను ఆరా తీశారు. ఎమ్మెల్యే వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న గృహిణులు, వృద్ధులు ఇళ్ల ముందు నిలుచుని స్వాగతం పలికారు, మరికొందరు హారతులు పట్టి స్వాగతించారు. గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి పరిష్కారానికి కోటి రూపాయలు కేటాయించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేశామని, పైపులైను పూర్తి కాగానే గోదావరి జలాలు తాగునీరుగా వస్తాయని ఎమ్మెల్యే చెప్పారు. వీధి కాలువలు, స్థలాలు ఉన్నవారికి ఇళ్లు కట్టుకుంటే స్కీమ్ మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కొరుప్రోలు, పెనుగొల్లు, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు సీహెచ్.రామచంద్రరాజు, దోసపాత్రుని హనుమంతరావు, అల్లాడ నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, మామిడి చంటి, ప్రసాద్, రాజు, కొత్త రేవు పోలవరం సర్పంచ్ మల్లేలోవరాజు, తహసీల్దార్ శ్యామ్, ఏపీఎం శివప్రసాద్, ఏపీవో సత్యవతి, మండల ఇంజినీరు దుర్గాశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు, వీఆర్వో నూకరాజు, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేశ్వరి, డిజిటల్ అసిస్టెంట్ నిర్మల, వ్యవసాయ, మత్స్యశాఖ సహాయకులు రమణ, చంద్రశేఖర్‌రావు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో స్వయం ఉపాధి పొందాలి

- ఐవోబీ ద్వారా రూ.32 కోట్ల రుణాలు



మేనేజర్ రవీంద్రను సన్మానిస్తున్న డ్వాక్రా మహిళలు

నక్కపల్లి : డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించుకోవాలని నక్కపల్లి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర అన్నారు. గురువారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రామహిళలతో సమావేశం నిర్వహించారు. పనితీరు బాగా ఉండి తీసుకున్న రుణాలతో వ్యాపారాలు సాగిస్తూ వాయిదాలు సక్రమంగా చెల్లించే సంఘాలకు రుణపరిమితి పెంచడంతో పాటు వారిని మరింత ప్రోత్సహిస్తామన్నారు. సంఘంలో సభ్యులంతా స్వయం ఉపాధి పొందే విధంగా రుణాలను ఉపయోగిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వాయిదాల చెల్లింపులకు ఇబ్బంది ఉండదన్నారు. తాజాగా మండలంలో ఐవోబీ పరిధిలో బ్యాంకు లింకేజీ ద్వారా 212 డ్వాక్రా సంఘాలకు రూ.32 కోట్లు రుణాలు ఇచ్చిన మేనేజర్‌ను డ్వాక్రా సిబ్బంది ఘనంగా సన్మానించారు. బ్యాంకు వారి ప్రోత్సాహంతో సంఘాల బలోపేతానికి చర్యలు చేపడతామని ఏపీఎం ఉషాదేవి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ కరుణానిధి, సిసి రాజు, ప్రకాష్, అప్పారావు, వీవోఏలు పాల్గొన్నారు.


రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం



మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ

మునగపాక : రహదారి విస్తరణ బాధితులకు ప్రభుత్వం నుంచి మెరుగైన పరిహారం అందిస్తామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పేర్కొన్నారు. ఇందుకు బాధితులు కూడా సహకరించాలన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలను దృష్టిలో ఉంచుకొని మెరుగైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూచట్టం ప్రకారం బాధితులను ఆదుకుంటామన్నారు. బాధితులు సహకరించడం ద్వారా రహదారి విస్తరణ పనులు వేగవంతమవుతాయన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, డీటీ వినయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

మైదానంపై మంచు ముసుగు



కోటవురట్లలో అలుముకున్న పొగమంచు

కోటవురట్ల : మైదానంపై మంచు కమ్ముకుంటోంది. దట్టంగా అలుముకుంటున్న పొగమంచుతో పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటలైనా మంచు వీడకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎదుట వచ్చే వాహనాలు కనిపించక లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

యలమంచిలి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సన్నిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం కోటవురట్ల మండలం పొందూరు గ్రామానికి చెందిన చీకట్ల తాతాబ్బాయి ఐదు మద్యం బాటిళ్లను గురవారం ఏటికొప్పాక గ్రామం నుంచి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు తాతబ్బాయిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. అక్రమంగా మద్యం తరలించవద్దని, మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.